

కోటా నీటిని వదలండి..
యాసంగి సీజన్‌కు ఎస్సారెస్పీ నుంచి కేటాయించిన నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.
- 8లో ▸



గరిష్టం/కనిష్టం
41.3 /27.6

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన ఎమ్మెల్యేలు



నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలోని వన్నెల్(కే) ఎత్తిపోతల పథకాన్ని ఆదివారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి సందర్శించారు. ఎత్తిపోతలలోని పంపుహౌస్ మోటార్లను పరిశీలించారు. అనంతరం గోదావరి నది ఒడ్డున గల శివాలయంలో పూజలు చేశారు. రైతులకు సాగునీరందించే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో సాగునీటి వ్యవస్థపై చర్చించారు. అలాగే పంపుహౌస్‌లోని మోటార్ల మరమ్మతుల కోసం డబ్బులు పోగు చేసుకునే విధానం, ఆయకట్టు రైతులు సభ్యత్వం తీసుకునే విధానాన్ని ఎమ్మెల్యేలకు రైతులు వివరించారు. వారి వెంట బీజేపీ ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పల్లెపురాజు, జిల్లా నాయకులు అబ్బిగంగారాం, సురేందర్ ఉన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

నిజామాబాద్‌అర్బన్: మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలో ఇందులో 13 సెంటర్లలో ఎగ్జామ్ నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో తరగతిలో ప్రవేశానికి పరీక్ష జరిగింది. ఆరో తరగతిలో ప్రవేశానికి మొత్తం 2,165 మంది విద్యార్థులకు గాను 1,803 మంది విద్యార్థులు హాజరయ్యారు. 362 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 7, 10వ తరగతిలో ప్రవేశానికి 13 సెంటర్లలో పరీక్ష జరగగా.. 1,819 మంది విద్యార్థులకు గాను 1516 మంది విద్యార్థులు హాజరయ్యారు. 303 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. డీఈవో దుర్గాప్రసాద్ పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

కష్టపడే వారికే పదవులు



బాన్సువాడ: పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు పదవులు లభిస్తాయని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నర్సింహ పేర్కొన్నారు. ఆదివారం బాన్సువాడలోని భారతి గార్డెన్ వెనకాల స్థలంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడలో 23 వేల పైచిలుకు ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి పాలయ్యారన్నారు. అందుకు ప్రతీకారంగా ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు బాన్సువాడలో అత్యధిక మెజారిటీ ఇవ్వాలని కార్యకర్తలను కోరారు. మన ప్రాంతానికి ఏం కావాలో, అది ఎవరితో సాధ్యమవుతుందో గ్రహించి ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో నాలుగింటిని అమలు చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకం ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైందని, పట్టణాల్లో కూడా ఉపాధి పనులు చేపట్టేందుకు చట్టం తీసుకువస్తామని పేర్కొన్నారు. దేశంలో 30 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కేంద్రంలో అధికారంలోకి వస్తే ఆయా ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలను కోరారు.

అంతా నా ఇష్టం!

- ఏకపక్షంగా వ్యవహరిస్తున్న తెయూ రిజిస్ట్రార్
- ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ ప్రమేయం లేకుండా నిర్ణయాలు
- ఈసీ తీర్మానాలను తుంగలో తొక్కుతున్న వైనం
- గుట్టుచప్పుడు కాకుండా అకడమిక్ కన్సల్టెంట్ల జీతాల పెంపు
- భారీగా పరీక్ష ఫీజుల పెంపు
- విద్యార్థుల ఆందోళనతో తగ్గింపు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ విశ్వవిద్యాలయంలో గత వైస్ చాన్స్‌లర్, ఇద్దరు ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు అనేక అక్రమాలకు పాల్పడడాన్ని అప్పటి పాలకమండలి సభ్యులు ఎండగట్టారు. రెండేళ్ల పాటు అక్రమ నియామకాలు, అవినీతి వ్యవహారాలపై అలుపెరగని పోరాటం చేశారు. ఎట్టకేలకు వారిని తొలగించడంతో.. రిజిస్ట్రార్‌గా యాదగిరి నియామకం అయ్యారు. కానీ ఆయన సైతం పాలక మండలి తీర్మానాల అమలు విషయంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వస్తున్నారు.

వర్సిటీలో పరిస్థితులు కుదుటపడుతున్న నేపథ్యంలో రిజిస్ట్రార్ యాదగిరి అంతా నా ఇష్టం అన్నట్లు వ్యవహరిస్తుండడంతో మళ్లీ గందరగోళం నెలకొంటోంది. ప్రస్తుతం పాలకమండలి లేకపోవడం, శాశ్వత వైస్ చాన్స్‌లర్ నియామకం ఇంకా కాకపోవడం, ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం హైదరాబాద్‌లో తీరిక లేకుండా ఉండడంతో రిజిస్ట్రార్ ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. దీంతో వర్సిటీలో కొత్త సమస్యలు మొదలవుతున్నాయి. కాగా గత నెల 24న ఇన్‌చార్జి వీసీ వెంకటేశం ఇక్కడకు వచ్చినప్పుడు సదరు పర్యటన విషయమై రిజిస్ట్రార్ గోప్యంగా ఉంచడం గమనార్హం. వర్సిటీ అధ్యాపకులకు, వివిధ విభాగాల అధిపతులకు, పాలనాపరమైన హోదాలో ఉన్న ప్రొఫెసర్లకు, బోధనేతర సిబ్బందికి కనీస సమాచారం ఇవ్వలేదు. అయితే బోధనేతర సిబ్బందిలో ఇద్దరికి మాత్రమే వీసీ వర్సిటీకి రావడానికి ఒక గంట ముందు చెప్పారు. వీసీ రాక వర్సిటీలోని ఒక్క విద్యార్థికి కానీ, విద్యార్థి సంఘాల నాయకులకు కానీ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కానీ సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

ఇక్కడ విచిత్రమేమిటంటే, వివాదాస్పద 2014 నియామకాల ద్వారా వచ్చిన ఒక గ్రూపునకు మాత్రం వీసీ రాక విషయమై సమాచారం ఇచ్చారు. ఇద్దరిని పిలిపించుకుని ఇన్‌చార్జి వీసీని కలిసేలా ఏర్పాటు చేయడం విశేషం. వీళ్లలోనే మరో వర్గానికి విషయం తెలియదు. వీసీ వర్సిటీకి వచ్చి వెళ్లిన విషయం మరుసటి రోజు దినపత్రికల ద్వారా తెలుసుకున్న ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ తీరుపై సర్వత్రా చర్చ జరిగింది.

■ ఇక తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఎన్నికల విషయంలో సైతం రిజిస్ట్రార్ ఏకపక్షంగా వ్యవహరించారు. అధ్యాపకులను రెండు వర్గాలుగా చీల్చడంలో ఆయన సఫలమైనట్లు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అంటున్నారు. ఇలా ఒక్కొక్క అంశాన్ని తవ్వి పరిశీలించుకుంటూ వెళితే అనేక వ్యవహారాలు వెలుగులోకి వస్తాయని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు.

ఏకపక్షంగా జీతాల పెంపు నిర్ణయం

ఇన్‌చార్జి వీసీ వచ్చిన సందర్భంలో పలు ప్రతిపాదనలకు ఆమోదం తీసుకున్నారు. ఇందులో అకడమిక్ కన్సల్టెంట్ల జీతాల పెంపునకు సంబంధించిన ఫైల్ ఉంది. గతంలో ప్రొఫెసర్ సాంబయ్య వీసీగా ఉన్నప్పుడు వీళ్ల వేతనాలు పెంచాల్సిన సందర్భంలో ఒక కమిటీ వేసి, సదరు కమిటీ సిఫారసుల మేరకు పెంచి, ఆ పెంపును ఈసీ సమావేశంలో ఆమోదం పొందిన తర్వాతే అమలు చేశారు. కానీ ప్రస్తుత రిజిస్ట్రార్ ఈ విషయాన్ని దాచిపెట్టి ఇష్టం వచ్చినట్లు వేతనాలు పెంచి చెల్లించారు. జీతాల పెంపు ప్రతిపాదన సమయంలో రిజిస్ట్రార్ యాదగిరిని 'సాక్షి' ఫోన్ ద్వారా సంప్రదించగా 'మీకు ఇలాంటి తప్పుడు సమాచారం ఎవరిచ్చారు' అని ఎదురు ప్రశ్నించారు. అయితే మరిప్పుడు దీనికి రిజిస్ట్రార్ ఏం సమాధానం చెబుతారో చూడాల్సి ఉంది.

ఫీజులు పెంచడంతో విద్యార్థుల ఆందోళన

వర్సిటీలో పరీక్షల విభాగం జారీచేసే వివిధ రకాల సర్టిఫికెట్ల ఫీజులను వందశాతానికి పెంచాలని, ఒరిజినల్ డిగ్రీ(ఓడీ) ఫీజును రూ. 700 నుంచి రూ. 3,500కు పెంచారు. ఇందుకు సంబంధించి పరీక్షల విభాగం ద్వారా అభిప్రాయాలు తీసుకోకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరించిన రిజిస్ట్రార్.. ఇన్‌చార్జి వీసీకి సమగ్రంగా వివరించకుండా, అదేదో సాధారణ విషయంలా చెప్పి సదరు ఫైల్‌కు ఆమోదముద్ర వేయించారు. పరీక్షల విభాగం అధికారులతో పాటు ఫైనాన్స్ ఆఫీసర్‌తో కమిటీ వేసి ఒక హేతుబద్ధమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ దీనిని విస్మరించి రిజిస్ట్రార్ ఏకపక్షంగా వ్యవహరించారు. అడ్డగోలుగా ఫీజులు పెంచంతో విద్యార్థి సంఘాలు నిరసనలు, ఆందోళనలు చేశాయి. దీంతో ఈ విషయాన్ని వీసీ మీదకు నెట్టేసి తప్పించుకున్నారు. దీంతో కొన్ని విద్యార్థి సంఘాలు వీసీ దిష్టిబొమ్మను నిజామాబాద్‌లో దహనం చేశాయి. ఈ పరిణామంతో మరుసటి రోజే ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. ఫీజుల పెంపు వివాదాన్ని పరీక్షల విభాగం తెచ్చిందని, తనకేం సంబంధం లేదని చెప్పి రిజిస్ట్రార్ చేతులు దులుపుకున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కలకలం!

- నిజామాబాద్‌లోనూ సాగిన వ్యవహారం?
- ప్రైవేటు గదులు, ఓ హోటల్‌లో జరిగినట్లు అనుమానాలు
- ఆరా తీసిన ఇంటెలిజెన్స్



ఖలీల్‌వాడి: రాష్ట్ర వ్యాప్తంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో నిజామాబాద్, కామారెడ్డి కేంద్రంగానే ట్యాపింగ్ వ్యవహారం నడిచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రైవేటు గదులు, ఓ హోటల్ కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో అభ్యర్థులు, వారికి సన్నిహితంగా ఉన్నవారు, వారి కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లను సేకరించి ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. అభ్యర్థులపై నిరంతరం నిఘాపెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ఫోన్లు ట్యాపింగ్ జరుగుతోందని అనుమానం వచ్చిన కొందరు అభ్యర్థులు వారి సన్నిహితులతో వాట్సప్ కాల్స్ మాట్లాడినట్లు సమాచారం. ఇప్పటికీ కొంతమంది ప్రజాప్రతినిధులు వాట్సప్ కాల్స్‌లోనే మాట్లాడుతున్నారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, వెంకటరమణారెడ్డిలు పోటీ చేశారు. కామారెడ్డిలోని ఓ ప్రముఖ హోటల్‌లో నాలుగు గదులు అద్దెకు తీసుకొని ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ప్రణీత్‌రావు విచారణలో ఈ విషయం స్పష్టం చేసినట్లు సమాచారం.

ట్యాపింగ్‌కు సహకరించిందెవరు..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఫోన్ ట్యాపింగ్‌కు సహకరించిందెవరనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి కావాల్సిన ఫోన్ నంబర్లతో పాటు వారి సన్నిహితుల వివరాలను సేకరించి ప్రత్యేకంగా ట్యాపింగ్ చేసి అభ్యర్థులను అలర్ట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి ఓ పార్టీకి చెందిన లీడర్లు లేదా పోలీసులు, మాజీ పోలీసులు సహకరించారా అనే కోణంలో ఇంటెలిజెన్స్ అధికారులు విచారిస్తున్నట్లు తెలిసింది.

ఇంటెలిజెన్స్ ఎంక్వైయిరీలో..

ఉమ్మడి జిల్లాలో ఫోన్ ట్యాపింగ్‌పై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. నిజామాబాద్ ఇంటెలిజెన్స్ అధికారుల విచారణలో ట్యాపింగ్ జరిగినట్లు తేలిందని సమాచారం. కానీ ఇది ఎక్కడ నుంచి ఆపరేట్ చేశారని స్పష్టంగా తెలియడం లేదు. కామారెడ్డిలోని ఓ ప్రముఖ హోటల్ కేంద్రంగా జరిగినట్లు గుర్తించి.. పూర్తి వివరాలను ఇంటెలిజెన్స్ వర్గాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్ఐబీ అధికారులను సిట్ అధికారులు విచారించడంతో తాజాగా జిల్లాలో ట్యాపింగ్ వ్యవహారం బయటకు వచ్చింది. దీనిపై టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల నుంచి సిట్ వివరాలు కోరింది. దీంతో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన వివరాలు ఒక్కొక్కటి బయటకు వస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బండ్లు ఓడలు.. ఓడలు బండ్లు అవుతాయి

- స్వార్థపరులే పోయారు
- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నస్రుల్లాబాద్: త్వరలోనే బండ్లు ఓడలు.. ఓడలు బండ్లు అవుతాయని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నస్రుల్లాబాద్‌లోని వెంకటసాయి విద్యానికేతన్ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల కార్యకర్తలతో పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ ఎంపీ సీటు బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కొంత మంది స్వార్థపరులు, దొంగలు పార్టీ నుంచి వెళ్లిపోయారన్నారు. వారి పోయినంత మాత్రాన ఏం జరగదన్నారు. తన రాజకీయ జీవితానికి ముందు నుంచి ఉన్న ప్రతి ఒక్కరు తనతోనే ఉన్నారని చెప్పారు. పక్క నియోజకవర్గం నాయకుడు అక్కడ వాళ్లు తరిమితే ఇక్కడకు వచ్చి ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు.

పద్మశాలీలకు అండగా ఉంటాం



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్‌పాల్

నిజామాబాద్‌నాగారం: పద్మశాలీలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎంపీ అర్వింద్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ముఖ్యమంత్రి ఎందుకు కాలేదో పద్మశాలీలు ఆలోచించాలన్నారు. పద్మశాలీలు ప్రధాని మోదీ వెంట నిలబడాలని కోరారు. రాజకీయంగా, నిధుల పరంగా పద్మశాలీలకు తగు ప్రాధాన్యత ఇచ్చామని, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా అండగా ఉంటామన్నారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ పద్మశాలీల అభివృద్ధి ఎల్లప్పుడూ కృషి చేస్తామన్నారు. ఏ సమస్య వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ పద్మశాలీల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని పేర్కొన్నారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ పద్మశాలి సంఘ భవనం కోసం రెండెకరాల భూమి కేటాయింపజేస్తామని, పద్మశాలీలు రాజకీయంగా ఎదిగేలా కృషి చేస్తామన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పద్మశాలి కార్పొరేషన్‌కు ఆరు నెలల్లోనే రూ. వెయ్యి కోట్ల నిధులివ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఎమ్మెల్యేలమంతా అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షుడు దీకొండ యాదగిరి, అధ్యక్షుడు బిజ్జు దత్తాద్రి.వ ర్కింగ్ ప్రెసిడెంట్ పుల్గం హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి అవదూత దశరథం, కోశాధికారి గుడ్ల భూమేశ్వర్, పద్మశాలి సంఘం నాయకులు గోస్కె యాదగిరి, బూర మల్లేశం, రాపెల్లి గురుచరణం, గుజ్జేటి వెంకటనర్సయ్య, రాపోలు సుధాకర్, చింతల గంగాదాస్ పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ రిక్రూట్‌మెంట్‌లో టామ్‌కామ్ జాప్యం

- ప్రైవేటు ఏజెంట్లను ఆశ్రయిస్తున్న వలస కార్మికులు
- ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.3.50 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వసూలు



మోర్తాడ్(బాల్కొండ): ఇజ్రాయిల్‌లో వలస కార్మికులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలను కల్పించడంలో భాగంగా ఆ దేశం వీసాలు జారీ చేయడానికి సిద్ధంగా ఉంది. అయితే ప్రభుత్వ రంగ సంస్థ అయిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్ (టామ్‌కామ్) ఇంటర్వ్యూలను నిర్వహించడంలో జాప్యం చేస్తోంది.

దీంతో నిరుద్యోగులు ప్రైవేటు ఏజెంట్లను ఆశ్రయిస్తూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. పాలస్తీనాతో యుద్ధంతో ఇజ్రాయిల్ వలస కార్మికుల కొరతను ఎదుర్కొంటుంది. మన దేశంతో ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఇజ్రాయిల్ తమ దేశంలో ఉపాధి అవకాశాలను కల్పించడానికి భారతీయ వలస కార్మికులకు భారీగానే వీసాలను జారీ చేస్తామని అంగీకరించింది. వ్యవసాయంతో పాటు భవన నిర్మాణ రంగంలో భారతీయ వలస కార్మికులు 1.60 లక్షల మందికి ఉపాధి కల్పించడానికి ఇజ్రాయిల్ ముందుకు వచ్చింది. గడచిన జనవరిలోనే ఇజ్రాయిల్‌కు వలస కార్మికులను తరలించడానికి మన విదేశాంగ శాఖ వివిధ రాష్ట్రాలకు అనుమతి ఇచ్చింది. ఇందు కోసం తెలంగాణ నుంచి వలస కార్మికులను తరలించడానికి టామ్‌కామ్ సంస్థ జోరుగా ప్రకటనలు ఇచ్చింది. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) వద్ద శిక్షణ పొందిన కార్మికులకు ఇజ్రాయిల్ రిక్రూట్‌మెంట్‌లో ప్రాధాన్యం ఇస్తామని టామ్‌కామ్ వెల్లడించింది. ఉమ్మడి జిల్లాల వారిగా న్యాక్, టామ్‌కామ్ సంస్థలు ఇజ్రాయిల్ వీసాల కోసం క్యాంపెయిన్ సైతం నిర్వహించారు. ఇజ్రాయిల్‌లో ఉపాధి పొందితే తక్కువ సమయంలో ఎక్కువ జీతం రాబట్టుకోవచ్చు అని భావించిన కార్మికులు రెండు సంస్థలు నిర్వహించిన క్యాంపెయిన్‌కు భారీ మొత్తంలో తరలివచ్చారు. ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి తదితర జిల్లాల్లో 3వేల మంది నిరుద్యోగులు ఇజ్రాయిల్ వెళ్లడానికి అవసరమైన శిక్షణ కోసం రిజిష్టర్ చేయించుకున్నారు. న్యాక్ ఆధ్వర్యంలో అనేక మంది శిక్షణ కూడా పూర్తి చేసుకున్నా రిక్రూట్‌మెంట్ కోసం టామ్‌కామ్ ఇంటర్వ్యూలను ఆరంభించలేకపోయింది. ప్రైవేటు ఏజెన్సీలు మాత్రం న్యాక్ శిక్షణ సర్టిఫికెట్ పొందిన వలస కార్మికులను ముంబై, ఢిల్లీ, చెన్నైలలో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలకు తరలిస్తున్నారు. ఒక్కో వలస కార్మికుని నుంచి వీసా కోసం రూ. 3.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. టామ్‌కామ్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తే తక్కువ ఫీజుతో వీసాల జారీ ప్రక్రియ పూర్తి అయ్యేదని నిరుద్యోగులు వాపోతున్నారు.

అప్పులు చేసి ఏజెంట్లకు డబ్బులు ముట్టచెబుతున్నారు. టామ్‌కామ్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలను నిర్వహించి ఉంటే దళారుల ప్రమేయం ఉండకుండా పారదర్శకంగా ఇజ్రాయిల్‌కు నియామకాలు జరిగేవని నిరుద్యోగులు చెబుతున్నారు. ప్రైవేటు ఏజెన్సీలు జోరుగా ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నా టామ్‌కామ్ మాత్రం నిమ్మకునీరెత్తకుండా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మేలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తాం

ఇజ్రాయిల్ వీసాల కోసం హైదరాబాద్‌లో మే నెలలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తాం. న్యాక్ శిక్షణ సర్టిఫికెట్‌లను పొందినవారే రిక్రూట్‌మెంట్‌కు అర్హత సాధిస్తారు. ఇప్పుడు ఢిల్లీ, ముంబై, చెన్నైలలో ఇంటర్వ్యూలు కొనసాగుతున్నాయి.

– భారతి, టామ్‌కామ్ జనరల్ మేనేజర్

ఎస్టీ రిజర్వేషన్ల పెంపు కాంగ్రెస్‌తోనే సాధ్యం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి
- బర్దిపూర్‌లో జిల్లా బంజారా గిరిజన ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఎస్టీల రిజర్వేషన్ పెంపు కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం 10 శాతం ఉన్న ఎస్టీ రిజర్వేషన్.. జనాభా ప్రాతిపదికన భవిష్యత్‌లో 12 శాతానికి పెంచే అవకాశం ఉందన్నారు. డిచ్‌పల్లి మండలం బర్దిపూర్ శివారులోని బృందావన్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా బంజారా గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో జీవన్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ నాన్చివేత ధోరణితో ఎస్టీ రిజర్వేషన్ అమలు జాప్యం జరిగిందని విమర్శించారు. మునుగోడు ఉపఎన్నిక సమయంలో బీఆర్ఎస్‌కు ఎస్టీలు దూరమవుతారేమోనని అప్పటి సీఎం కేసీఆర్ ఎస్టీ రిజర్వేషన్‌ను 10 శాతానికి పెంచుతామని ప్రకటించారని గుర్తు చేశారు. తుక్కుగూడలో సభలో రాహుల్‌గాంధీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేస్తామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బీజేపీ ఎంపీ అర్వింద్ జిల్లాకు ఏం చేశాడో.. ఏం చేస్తాడో చెప్పడం లేదని విమర్శించారు. తనను గెలిపిస్తే రైతాంగం, రాష్ట్ర ప్రజల హక్కుల సాధన కోసం పార్లమెంట్‌లో గళం వినిపిస్తానన్నారు. ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ మచ్చలేని నాయకుడు జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి మాట్లాడుతూ పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రూ. 5కోట్లతో జిల్లా బంజారా భవన్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. పోడు సమస్యలు పరిష్కరించి, గిరిజనులకు పోడు పట్టాలు ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, జిల్లా గిరిజన ఆదివాసీ చైర్మన్, మాజీ ఎంపీపీ కెతావత్ యాదగిరి, ఆల్ ఇండియా బంజారా సేవా సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తారాచంద్‌నాయక్, రాష్ట్ర గిరిజన సహకార, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ గిరిజన చైర్మన్ తెజావత్ బెల్లయ్య నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్‌బిన్ హందాన్, ఈరవత్రి అనిల్, అన్వేష్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి కె.నగేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, కోరుట్ల ఇన్‌చార్జి నర్సింగ్‌రావు, పీసీసీ డెలిగేట్స్ గడుగు గంగాధర్, చంద్రశేఖర్ గౌడ్, ముప్ప గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు

జక్రాన్‌పల్లి: జిల్లాలో రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో జక్రాన్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో యాసంగిలో సాగు వేసిన వరి పంట ఎండిపోతోంది. మరో 15 రోజుల్లో చేతికందాల్సిన పంట కళ్లముందే ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఎక్కువగా బోరుబావులపై ఆధారపడి రైతులు వరి సాగు చేస్తారు. యాసంగిలో పంటలకు ఢోకా ఉండదని భావించి రైతులు వివిధ పంటలను వేశారు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు ఎత్తిపోతున్నాయి. దీంతో వరి పంట చివరి దశలో సాగు నీరందక ఎండిపోతోంది. బ్రాహ్మణ్‌పల్లి, తొర్లికొండ, మినహా మిగతా గ్రామాల్లో బోరుబావులపై ఆధారపడి పంటలను సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ. 20 వేలు ఖర్చు చేసి వేసిన వరి ఎండిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.



పడకల్ శివారులో ఎండిపోయిన వరి



కలిగోట్ రోడ్డులో..

క్లుప్తంగా

ముగిసిన సంగీత పాఠశాల వార్షిక పరీక్షలు



నిజామాబాద్‌ సిటీ: జిల్లా కేంద్రంలోని శ్రీజ్ఞాన సరస్వతి ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో ఆదివారం వార్షిక పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్‌ సరిత తెలిపారు. సర్టిఫికెట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, డిప్లొమాలో ప్రథమ సంవత్సరం విద్యార్థినీవిద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 138 మంది హాజరయ్యారు. వచ్చే సంవత్సరం 2024–25కు గాను ప్రవేశాలకు జూన్‌ 13 నుంచి సుభాష్‌నగర్‌ సంగీత నృత్య పాఠశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్‌ కోరారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు నిర్వహించే పరీక్షలు జులైలో జరిగే అవకాశం ఉందని ప్రిన్సిపల్‌ తెలిపారు.

వ్యాయామంతో ఆరోగ్యం



నిజామాబాద్‌ నాగారం: ప్రతినిత్యం వ్యాయామం చేయడంతో ఆరోగ్యం లభిస్తుందని ఐఎంఏ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం ఐఎంఏ ఆధ్వర్యంలో నగరంలోని పాలిటెక్నిక్‌ కళాశాలలో మార్నింగ్‌ వాకర్స్‌కు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు దామోదర్‌రావు, శ్రీశైలం మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండాలంటే, కాలి నడకనే ముఖ్యమని అన్నారు. అనంతరం మార్నింగ్‌ వాకర్స్‌కు అంబలి పంపిణీ చేశారు. సంఘ ప్రతినిధులు ఏలేటి రవీంద్రరెడ్డి, జీవన్‌రావ్‌, ఫరీదబేగం, హరీష్‌ స్వామి, నీలి రాంచందర్‌, జలగం తిరుపతిరావ్‌, బండారి సుజాత, నాగ మోహన్‌, వినోద్‌ కుమార్‌గుప్తా, రామ్‌మోహన్‌ రావు, రమాదేవి పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



నిజామాబాద్‌ సిటీ: నగరంలోని శంభులింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఏలేటి పశుపతి శర్మ ఆధ్వర్యంలో శివపర్వతుల కల్యాణాన్ని వేదమంత్రాల మధ్య నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీరాం రవీందర్‌, ఆలయ చైర్మన్‌ గాండ్ల లింగం, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

కోటా నీటిని వదలండి

- లక్ష్మి కాలువ ఆయకట్టు రైతుల డిమాండ్‌
- ఆయకట్టుకు కేటాయించింది 2.5 టీఎంసీలు..
- విడుదల చేసింది 2.2 టీఎంసీలు



ఆయకట్టు పరిధిలో వరి పంట



ఎత్తిపోయిన లక్ష్మి కాలువ హెడ్‌ రెగ్యులేటర్‌

బాల్కొండ: యాసంగి సీజన్‌కు ఎస్సారెస్పీ నుంచి కేటాయించిన నీటి కోటాను లక్ష్మి కాలువ ద్వారా వెంటనే విడుదల చేయాలని ఆయకట్టు రైతులు డిమాండ్‌ చేస్తున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌ నుంచి జిల్లా రైతాంగానికి లబ్ధి చేకూరేది లక్ష్మి కాలువ ద్వారానే.. ఈ కాలువ ఆధారంగా 50 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. యాసంగి పంటల కోసం లక్ష్మి కాలువ ఆయకట్టుకు 2.5టీఎంసీల నీటిని కేటాయించినప్పటికీ.. ఇప్పటి వరకు 2.2 టీఎంసీల నీటిని విడుదల చేశారు. కేటాయించిన కోటా ప్రకారమైనా మరో 0.3 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉంది. కానీ ప్రస్తుతం అన్ని కాలువలతో సమానంగా ప్రాజెక్ట్‌ నుంచి లక్ష్మికాలువ ద్వారా నీటి విడుదలను నిలిపివేశారని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నీటి విడుదల చేపట్టాలని కోరుతున్నారు.

ఆలస్యంగా నీటి విడుదల

లక్ష్మికాలువకు అన్ని కాలువలతో సమానంగా డిసెంబర్‌ మధ్య నుంచి కాకుండా నెలాఖరు నుంచి నీటిని విడుదల చేశారు. దీంతో ఆయకట్టు పరిధిలో పంటలసాగు ఆలస్యమైంది. ప్రస్తుతం పంట చివరి దశలో ఉండగా మరో తడి అవసరం ఉంది. కానీ ప్రభుత్వం తాగు నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఒక్క చుక్క నీటిని కూడా విడుదల చేసేందుకు అనుమతివ్వడం లేదని ప్రాజెక్ట్‌ అధికారులు అంటున్నారు. సుమారు 15 రోజులు ఆలస్యంగా నీటిని విడుదలను ప్రారంభించి కేటాయించిన కోటాను పూర్తి చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎత్తిపోయిన లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్‌

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి నీటిమట్టం వేగంగా తగ్గడం కారణంగా లక్ష్మి కాలువ హెడ్‌ రెగ్యులేటర్‌ ఎత్తిపోయింది. కానీ లక్ష్మికాలువ ద్వారా ప్రాజెక్ట్‌లో నిర్మించిన లక్ష్మిలిఫ్ట్‌ ద్వారా కాలువకు నీటి విడుదల చేపట్టొచ్చు. ఇది వరకు లక్ష్మికాలువకు నీటిని ఎత్తిపోసేందుకు పలుమార్లు లిఫ్టును ట్రయల్‌ రన్‌ నిర్వహించారు. లిఫ్టు కూడా నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి మాత్రం నీటి విడుదలకు గ్రీన్‌ సిగ్నల్‌ రావడం లేదు.

అనుమతులు రాలేదు

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి లక్ష్మికాలువ ద్వారా నీటి విడుదల చేపట్టడానికి ప్రస్తుతం ఎలాంటి అనుమతులను ప్రభుత్వం ఇవ్వలేదు. లక్ష్మికాలువకు కేటాయించిన మరో 0.3 టీఎంసీల నీటిని వదలాలి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– శేఖర్‌ బాబు, ఏఈఈ, మైనర్‌ ఇరిగేషన్‌, బాల్కొండ

హామీల అమలుకు ప్రశ్నించేవారు అవసరం

- బాజిరెడ్డిని గెలిపించండి
- ఐదేళ్లలో అర్వింద్‌ ఒక్క రూపాయి పని చేయలేదు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇక్కడ ప్రజలకు కనిపించలేదు
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌

కమ్మర్‌పల్లి: హామీల అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించే వారు అవసరమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని లలిత గార్డెన్స్‌లో కమ్మర్‌పల్లి, మోర్తాడ్‌, ఏర్గట్ల మండలాల బీఆర్‌ఎస్‌ కార్యకర్తల లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రశాంత్‌రెడ్డితోపాటు బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్‌ అమలుసాధ్యం కాని హామీలు ఇచ్చిందని మండిపడ్డారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పారని, అధికారం చేపట్టి 120 రోజులువుతున్నా మహిళలకు ఉచిత బస్సుప్రయాణం హామీ తప్పి ఏ హామీని నెరవేర్చలేదన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొందరికే పరిమితం చేశారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను బిగ్‌ స్ట్రీన్‌పై ప్రదర్శింపజేశారు. కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఐదేళ్లలో ఎమ్మెల్సీ హోదాలో మంచిచెడుకు ఏనాడైనా మీ గ్రామాలకు వచ్చారా? ఆయనకు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. పసుపు బోర్డు ఎక్కడ ఉందో ఎంపీ అర్వింద్‌ రైతులకు చూపించాలని అన్నారు. బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందన్నారు. ఆయన ఓ బిగ్‌ ఫైటర్‌ అని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ప్రజల పక్షాన నిలబడటానికి ఎంపీగా బాజిరెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు.

సేవకుడిగా పని చేస్తా : బాజిరెడ్డి గోవర్ధన్‌

తనను ఎంపీగా గెలిపిస్తే ఐదేళ్లు సేవకుడిగా పని చేస్తానని బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ అన్నారు. జిల్లాలోని బాల్కొండ, ఆర్మూర్‌, నిజామాబాద్‌ రూరల్‌, అర్బన్‌ నియోజకవర్గాల ప్రజలతో తనకు సత్సంబంధాలున్నాయని, జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల ప్రజలు తనకే ఓటు వేస్తామంటున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అధికారం అనే అహంకారంతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తారని, గెలిపించిన ప్రజలకు పని చేయాలన్న సోయి లేని అర్వింద్‌కు కోరుట్ల నియోజకవర్గ ప్రజలు మళ్లీ బుద్ధి చెబుతామని అంటున్నారన్నారు. తనను గెలిపిస్తే లోక్‌సభ సమావేశాలున్నప్పుడు ఢిల్లీలో ఉంట, లేదంటే ఇక్కడే ప్రజల మధ్యలోనే ఉంటానని బాజిరెడ్డి స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్‌ నాయకులు కోటపాటి నర్సింహానాయుడు, మండలాధ్యక్షుడు రేగుంట దేవేందర్‌, చిన్నారెడ్డి, పూర్ణానందం తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

రుణ పరిమితి అంతంతే..

- 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఖరారైన స్కేల్‌ ఆఫ్‌ ఫైనాన్స్‌
- పంట రుణాలపై బ్యాంకులకు టెస్కాబ్‌ దిశానిర్దేశం
- రుణపరిమితిని పెంచాలంటున్న రైతులు



మోర్తాడ్‌(బాల్కొండ): పంట సాగుకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నా.. అందుకు అనుగుణంగా బ్యాంకులు రుణాలు అందించడం లేదనే వాదన వినిపిస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను స్కేల్‌ ఆఫ్‌ ఫైనాన్స్‌(రుణ పరిమితి)ని తెలంగాణ కో ఆపరేటివ్‌ బ్యాంకు లిమిటెడ్‌(టెస్కాబ్‌) నిర్దేశించింది. వర్షాకాలం, యాసంగి సీజన్‌లకు ఇచ్చే రుణ పరిమితిని పరిశీలిస్తే పంటల సాగుకు గతంలో నిర్ణయించిన రుణాల మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరం కూడా వర్తింప చేయనున్నారని స్పష్టమైతోంది. సాగు ఖర్చులు ఒక్కో ఎకరానికి గతంతో పోలిస్తే రూ.5వేల నుంచి రూ.10వేల వరకు పెరిగితే బ్యాంకులు మాత్రం రూ.2వేల నుంచి రూ.3వేల వరకు రుణపరిమితిని పెంచి అందించనున్నాయి. బ్యాంకు ఇచ్చే రుణాలు సాగు ఖర్చులకు సరిపోకపోవడంతో రైతులు ప్రైవేట్‌ ఫైనాన్స్‌ సంస్థలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వరి సాగు కోసం ఎకరానికి రూ.43వేల నుంచి రూ.45వేల రుణం ఇవ్వాలని నిర్ణయించారు. గతంలోనూ ఇదే పరిమితిని వర్తింపజేశారు. మొక్కజొన్న పంటకు రూ.32వేల నుంచి రూ.34 వేల వరకు, పసుపునకు రూ.85వేల నుంచి రూ.87వేల రుణం ఇవ్వాలని తీర్మానించారు. పసుపు సాగుకు రైతులు ఒక్కో ఎకరానికి రూ.1.10లక్షల నుంచి రూ.1.25లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. సోయాకు రూ.28వేల నుంచి రూ.30వేల వరకు, పత్తికి మాత్రం ఎకరానికి రూ.1.50లక్షల వరకు రుణం ఇవ్వాలని నిర్ణయించారు. గతంలో రూ.1.25లక్షల వరకు రుణం ఇచ్చేవారు. ప్రస్తుతం ఎకరానికి రూ.25వేల వరకు పెంచారు. జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం తక్కువగానే ఉంటుంది. పసుపు, మొక్కజొన్న, వరి, సోయా పంటలకు రుణ పరిమితిని కనీసం రూ.10వేల చొప్పున పెంచి ఉంటే రైతులకు ఎంతో ఊరట లభించేదని పలువురు పేర్కొంటున్నారు.

స్కేల్‌ ఆఫ్‌ ఫైనాన్స్‌ అమలులో నిర్లక్ష్యం

పంటల సాగుకు రుణ పరిమితిని టెస్కాబ్‌ వెల్లడించగా కొన్ని వాణిజ్య బ్యాంకుల అధికారులు స్కేల్‌ ఆఫ్‌ ఫైనాన్స్‌ను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పసుపునకు ఎకరానికి రూ.85వేల వరకు రుణం ఇవ్వాలని ఉత్తర్వులున్నా.. కొందరు బ్యాంకర్లు రూ.60వేలకు మించి ఇవ్వడం లేదని తెలుస్తోంది. బ్యాంకర్లపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే వారు రుణం ఇవ్వకుండా సతాయిస్తారనే భయంతో రైతులు మౌనంగా ఉండిపోతున్నారు. స్కేల్‌ ఆఫ్‌ ఫైనాన్స్‌ నిర్ణయమే తక్కువగా ఉంటే దీనిని కూడా బ్యాంకర్లు పట్టించుకోకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పంటల సాగుకు ఎంత పెట్టుబడి అవసరం అవుతుంది? ఎంత వరకు రుణం ఇస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందోనని క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని పలువురు సూచిస్తున్నారు.

సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకోవాలి



సాగు ఖర్చులను బ్యాంకర్లు దృష్టిలో ఉంచుకోవాలి. స్కేల్‌ ఆఫ్‌ ఫైనాన్స్‌ ప్రకారం రుణాలు ఇవ్వడమే కాకుండా పెట్టుబడులను పరిగణలోకి తీసుకుని వచ్చే ఆర్థిక సంవత్సరంలోనైనా సాగు కోసం రుణ పరిమితిని పెంచాలి. లేకుంటే రైతులు ఫైనాన్స్‌ సంస్థలను ఆశ్రయించాల్సి వస్తుంది.

– కే.చిన్న రాజేశ్వర్‌, రైతు, మోర్తాడ్‌

పొతంగల్‌లో బీజేపీ ఆత్మీయ సమ్మేళనం



బీజేపీలో చేరిన వారితో అరుణతార

రుద్రూర్‌: పొతంగల్‌ మండల కేంద్రంలో బూత్‌ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. సమ్మేళనానికి బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అరుణతార హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ హవా కొనసాగుతోందని అన్నారు. బూత్‌ స్థాయి బాధ్యులు ప్రణాళిక బద్ధంగా పని చేయాలని సూచించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు బీజేపీలో చేరారు. వీరికి అరుణతార కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జహీరాబాద్‌ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, ఓబీసీ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగం సాయిలు, బాన్సువాడ సెగ్మెంట్‌ పార్టీ కోకన్వీనర్‌ కాపు గాండ్ల శ్రీనివాస్‌, పార్టీ బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడికి సన్మానం



శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాజంపేట : కామారెడ్డి జిల్లా కోర్టు బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షునికి ఆదివారం ఘనంగా సన్మానం చేశారు. జిల్లాలోని రాజంపేట మండల కేంద్రానికి చెందిన కోల శ్రీకాంత్‌ గౌడ్‌ ను కామారెడ్డి జిల్లా కోర్టు బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాంత్‌ గౌడ్‌ మిత్రులు రాజంపేట మండల కేంద్రానికి చెందిన మిత్రులు ఫ్రెండ్స్‌ యూత్‌ క్లబ్‌ వారి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. రమేశ్‌గుప్తా, బాలాజీ, శ్రీధర్‌ పటేల్‌, స్వయం ప్రకాశ్‌, వేణు ప్రసాద్‌, సంజీవ్‌ దేవ్‌, వెంకట రాజేశ్వర్‌, ప్రవీణ్‌, నరేందర్‌, రాజేందర్‌, ప్రవీణ్‌ కుమార్‌, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



చుక్కాపూర్‌ ఉన్నత పాఠశాల 1991-92 బ్యాచ్‌ విద్యార్థులు..



కామరెడ్డి ఎస్సీ బాలుర హాస్టల్‌ పూర్వ విద్యార్థులు..

సాక్షి నెట్‌వర్క్‌: దశాబ్దాల తరువాత ఒకేవేదికపైకి చేరిన పూర్వ విద్యార్థులు సందడి చేశారు. మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌తోపాటు దోమకొండ, వేల్పూర్‌ మండలం అంక్సాపూర్‌, కామారెడ్డి, బాన్సువాడ పట్టణాల్లో పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ.. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుని ఉత్సాహంగా గడిపారు.



దోమకొండలో 1997-98 బ్యాచ్‌ విద్యార్థులు



వేల్పూర్‌ మండలం అంక్సాపూర్‌లో 2003 - 04 బ్యాచ్‌ విద్యార్థులు

క్రైం కార్నర్‌

చెట్టు పైనుంచి పడి యువతి మృతి



భూలి (ఫైల్‌)

రాజంపేట: మొర్రిపండ్ల కోసం చెట్టెక్కిన యువతి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందింది. రాజంపేట మండలం షేర్‌శంకర్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. షేర్‌ శంకర్‌తండా జీపీ పరిధిలోని మూడు మామిళ్లతండాకు చెందిన ముద్రిచ్చ భూలి(22) తన తల్లి లక్ష్మి, స్థానికులతో కలిసి ఆదివారం మొర్రిపండ్లు తెంపేందుకు వెళ్లింది. చెట్టుపైకి ఎక్కి పండ్లు తెంపుతున్న క్రమంలో భూలి ప్రమాదవశాత్తు కిందపడిపోగా తీవ్రగాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి.. మెరుగైన చికిత్స కోసం అక్కడికి నుంచి హైదరాబాద్‌కు తరలించగా, భూలి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్‌ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..

ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో మండలంలోని మాసానిపల్లికి చెందిన గౌరై నవీన్‌(34) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆత్మకూర్‌ పీడబ్ల్యూడీ రోడ్డుపై శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి నవీన్‌ తన ఇంటి నుంచి మాచాపూర్‌ గ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో ఆత్మకూర్‌ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో నవీన్‌ తలకు బలమైన గాయాలై ఘటనాస్థలంలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు



నవీన్‌ (ఫైల్‌)

విద్యుత్‌ షాక్‌తో రైతు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్‌ తండాకు చెందిన గిరిజన రైతు కేతావత్‌ కిషన్‌(38) ఆదివారం సాయంత్రం విద్యుత్‌ షాక్‌తో మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. కిషన్‌ తన వ్యవసాయ బోరు మోటారు వద్ద పశువుల కోసం పచ్చి గడ్డి కోస్తుండగా కొడవలికి విద్యుత్‌ వైరు తగిలి షాక్‌ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య అంజి, ఇద్దరు కుమారులున్నారు.



రైతు కిషన్‌ (ఫైల్‌)

చెరువుకట్టపై ఆటో బోల్తా



ఎల్లారెడ్డి: పట్టణంలోని పెద్ద చెరువుకట్టపై ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడగా, నలుగురికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. హైదరాబాద్‌ నుంచి ఎల్లారెడ్డికి వస్తున్న ఆటో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించేక్రమంలో కట్టపై బోల్తాపడిందన్నారు. పెద్దారం లక్ష్మి, నితీశ్‌, పెంటయ్య, కృష్ణకు తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో పట్టణంలోని ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్వీట్లు తయారు చేసి జాతరలలో విక్రయించే చింతల రాజు భార్య రేణుక, కుమారుడు, కుమార్తెతో కలిసి ఉంటున్నాడు. కొద్దిరోజులుగా రాజు మద్యం, కల్లుకు బానిస అయ్యాడు. భార్య రేణుక పిల్లలను తీసుకొని ఈనెల 3వ తేదీన తల్లి గారింటికి వెళ్లగా, శనివారం రాత్రి 10గంటలకు ఇంట్లో ఎవరూలేని సమయంలో రాజు ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తన కొడుకు మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని రాజు తల్లి నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

తిర్మలాపూర్‌లో..

బాన్సువాడ రూరల్‌: మండలంలోని తిర్మలాపూర్‌ గ్రామానికి చెందిన పెద్దారం రమేశ్‌(35) శనివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ మున్నూరు కృష్ణ తెలిపారు. బతుకుదెరువు కోసం భార్యాపిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లిన రమేశ్‌ ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడి కోలుకున్నాడు. తన కొడుకు మద్యానికి బానిసై, జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు రమేశ్‌ తండ్రి పెద్దారం విఠల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం గూడెం గ్రామ శివారులో పేకాటస్థావరంపై దేవునిపల్లి, టాస్క్‌ఫోర్స్‌ పోలీసు సిబ్బంది కలిసి ఆదివారం సాయంత్రం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకొని రూ.13,830 నగదు, ఐదు బైక్‌లు, 6సెల్‌ఫోన్లను సీజ్‌ చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

కలువ పూలకోసం వెళ్లి కానరాని లోకాలకు

- చెరువులో మునిగి ఇద్దరు స్నేహితులు మృతి
- సాలూర మండలం కుమ్మన్‌పల్లి శివారులో ఘటన
- మృతులు సాలూర క్యాంప్‌నకు చెందిన యువకులు



మనోజ్‌కుమార్‌ (ఫైల్‌)



మనోజ్‌రెడ్డి (ఫైల్‌)

బోధన్‌రూరల్‌(బోధన్‌): కలువ పూల కోసం చెరువులోకి దిగి ఇద్దరు స్నేహితులు నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన సాలూర మండలంలోని సాలూర క్యాంప్‌లో విషాదాన్ని నింపింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. సాలూర క్యాంప్‌నకు చెందిన స్నేహితులు గోరంట్ల మనోజ్‌(22), గాదె మనోజ్‌రెడ్డి(23) శనివారం సాయంత్రం వాకింగ్‌ చేస్తూ పక్కగ్రామమైన కుమ్మన్‌పల్లి శివారులోని చెరువు వైపు వెళ్లారు. చెరువులో కలువ పూలను చూసిన వారు.. పూలను కోసేందుకు చెరువులోకి దిగారు. కోసిన పూలను ఒడ్డున పెట్టిన తరువాత చెరువులోని గుంతవద్ద ఇరుక్కుని నీటమునిగిపోయారు. ఆదివారం ఉదయం చెరువు వైపు వెళ్లిన స్థానికులు చెరువులో మృతదేహాలను చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మనోజ, మనోజ్‌రెడ్డి మృతదేహాలను బయటకి తీయించారు. గోరంట్ల మనోజ్‌ బోధన్‌ పట్టణంలోని ఓ ప్రైవేట్‌ కాలేజీలో డిగ్రీ చదువుతుండగా, గాదె మనోజ్‌రెడ్డి చర్చి ఫాదర్‌ కోర్సు చేస్తున్నాడు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో సాలూర క్యాంప్‌లో విషాదచాయలు అలుముకున్నాయి. గోరంట్ల మనోజ్‌ అంత్యక్రియలు ఆదివారం పూర్తికాగా, గాదె మనోజ్‌ తమ్ముడు విదేశాల నుంచి రావాల్సి ఉండడంతో అంత్యక్రియలను సోమవారం (నేడు) చేయనున్నారు. బోధన్‌ రూరల్‌ సీఐ నరేశ్‌, ఎస్సై నాగనాథ్‌ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగనాథ్‌ తెలిపారు.

సిలిండర్‌ లీకై అగ్నిప్రమాదం

- చంద్రాయన్‌పల్లిలో ఘటన
- బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లిలో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బర్దిపూర్‌ భూమయ్య అనే వ్యక్తి ఇంట్లో గ్యాస్‌ సిలిండర్‌ లీకై మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. భూమయ్య భార్య కంటి ఆపరేషన్‌కి దాచుకున్న సుమారు లక్ష రూపాయల నగదుతోపాటు విలువైన సామగ్రి దగ్ధమైనట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. విషయం తెలుసుకున్న రూరల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ భూపతిరెడ్డి గ్రామానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. తక్షణ సహాయం కింద రూ.10వేలు, క్వింటాలు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా భూమయ్య కంటి ఆపరేషన్‌ పూర్తయ్యేలా చూస్తామని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో బాధిత కుటుంబానికి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఆయనవెంట ఆర్‌ఐ మోహన్‌, మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు నవీన్‌గౌడ్‌, సంతోష్‌రెడ్డి ఉన్నారు.